ఇంటర్వ్యూ

# సాహిత్య విమర్శకు సామాజిక నేపథ్య పరిశీలన సరిపోదు

*గాలి వస్తే కదిలిపోయేటట్లుండే ఆయన తెలుగుదేశంలో తీవ్ర నిర్బంధపు తుఫానును సైతం తట్టుకుని ప్రభుత్వానికి నిజమయిన ప్రతిపక్షంగా ఉన్న పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించారు. లెక్చరర్‌గా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు బోధించింది గణితమయినా ఆర్థిక, సామాజికశాస్త్ర, సాహిత్య విమర్శనాది ఉపరితల రంగాల్లో ఆయన స్పృశించని అంశం లేదు. ఆయనే డాక్టర్ కె. బాలగోపాల్. ఎటు నడిచినా రెండడుగులు వేయలేని రేకుల షెడ్డులో (హైదరాబాద్) ఆయన నివాసం. బాలగోపాల్ సాహిత్య వ్యాసాల సంకలనం 'రూపం-సారం' అనే పేరుతో వెలువడింది. అది కాక ఆయన సాహిత్య పత్రికల్లో ఎన్నో వ్యాసాలు రాశారు. ఆయనతో ఆంధ్రభూమి ప్రతినిధి కృష్ణుడు (ఎ. కృష్ణారావు) జరిపిన ఇంటర్వ్యూ ఇది.*

**ప్ర :** రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి మనవలు మీరు. చిన్నప్పుడు పద్యాలూ, కవితలూ రాశారని విన్నాను. జాతీయోద్యమం నుంచి కవిసేన మానిఫెస్టోదాకా వివిధ అంశాలపై మీరు రాసిన సాహిత్య విమర్శ ప్రామాణికమయినదని విమర్శకులు సైతం అన్నారు. సాహిత్య విమర్శను మీరు కొనసాగిస్తే తెలుగు సాహిత్యానికి మంచి సాహిత్య విమర్శకులుగా, ప్రత్యామ్నాయ సాహిత్యానికి ఒక మంచి అండగా ఉండేవారు. చిన్నప్పటి నుంచీ మీలో ప్రవహిస్తున్న సాహిత్యమనే జీవనదిని ఎందుకు బలవంతంగా ఇంకింప చేస్తున్నారు? మాడెస్టీవల్ల కొంత, మీరు తెచ్చిపెట్టుకున్న పనులవల్ల కొంత మీరు సాహిత్యం ద్వారా సమాజానికి చేయవలసిన న్యాయం చేయలేదనే విమర్శ గురించి ఏమంటారు?

**జ :** నాకు సాహిత్యంతో లోతైన పరిచయం ఎప్పుడూ లేదు. చదివే అలవాటు చిన్నప్పటి నుండి వుంది గానీ తెలుగు సాహిత్యం కంటే పాశ్చాత్య సాహిత్యంతోనే

ఆంధ్రభూమి దినపత్రికలో రెండుసార్లుగా వచ్చిన ఇంటర్వ్యూ 17.06.1989, 24.6.1989

నాకు పరిచయం ఎక్కువ. పోతే, సాహిత్యం మీద నేను రాసిన వ్యాసాలు సమగ్రమయిన సాహిత్య విమర్శ అని నేను అనుకోవడం లేదు. మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటే సామాజిక ఆర్థిక నేపథ్యంలో సాహిత్యాన్ని పరిశీలించడం అనుకుంటే పొరబాటే. నేను చేసింది ఆ పరిశీలన మాత్రమే. నిజానికి సమగ్రమయిన మార్క్సిస్టు సాహిత్య విమర్శకు సంబంధించిన తాత్విక సమస్యలు చాలావరకు అపరిష్కృతంగానే ఉన్నాయి. పునాది ఉపరితలం, అవయవి అవయవం మొదలయిన ప్రత్యయద్వయాల విశ్లేషణ, వివరణ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఆచరణ ద్వారానే సిద్ధాంత వివరణ సాధ్యమవుతుందన్న సాధారణ సూత్రాన్ని అనుసరించి, సాహిత్య విమర్శ ద్వారానే సాహిత్య సిద్ధాంత ప్రతిపాదన జరుగుతున్నదనిపిస్తుంది. అది నా రంగంగా ఎంచుకోలేదు. నేను ప్రజాతంత్ర ఉద్యమంలో ప్రవేశించిన నాటికి మన రాష్ట్రంలో నిర్బంధం తీవ్ర దశను చేరుకుంది. అప్పటినుండి రోజురోజుకూ పెరుగుతూనే వుంది. ఆ కారణంగా పౌరహక్కుల ఉద్యమం అవసరమే ఎక్కువ ఉందనిపిస్తుంది. ఇందులో 'మాడెస్టీ' ఏమీ లేదు.

**ప్ర :** సామాజిక, ఆర్థిక నేపథ్యం పరిశీలిస్తే మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఎందుకు కాదు?

**జ :** సామాజిక నేపథ్యంలో పరిశీలించడం తప్పనిసరిగా అవసరమే. కాని ఆ నేపథ్యాన్ని వివరించడంతో మార్క్సిస్టు సాహిత్య విమర్శ అయిపోదు. సామాజిక విశ్లేషణకు వర్గాల మధ్య, లేక సామాజిక బృందాల మధ్య వుండే సంబంధాలు వస్తువు. రైతు కూలీలు భూస్వాములు; అగ్రకులాలు అంటరానివాళ్ళు; స్త్రీలు పురుషులు; అనే విభజన దానికి ప్రాతిపదిక. సాహిత్యానికి ముఖ్యంగా కథానవలా సాహిత్యానికి వస్తువు వర్గాల మధ్య సంబంధాలు కాదు, వ్యక్తుల మధ్య సంబంధాలు. ఆ వ్యక్తులు కూలివాళ్ళో, రైతులో, పెట్టుబడిదార్లో అయి వుంటారు. బ్రాహ్మణులో, మాలవాళ్ళో అయి వుంటారు. స్త్రీలో, పురుషులో అయి వుంటారు. ఆ మేరకు సామాజిక విశ్లేషణ దానికి నేపథ్యం అవుతుంది. కాని నేపథ్యం మాత్రమే అవుతుంది. ఆ నేపథ్యంలో పుట్టి, ఆ చట్రంలో ఎదిగిన వ్యక్తుల వైయక్తిక ప్రత్యేకతలలో ప్రతిఫలించే సామాజిక సంఘర్షణ సాహిత్యానికి సమీప వస్తువు. దాని ద్వారానే సమాజం సాహిత్య వస్తువవుతుంది. సమాజం నేరుగా సాహిత్య

వస్తువు అయినప్పుడు ఆ సాహిత్యం అంత సంతృప్తికరంగా వుండదు. అందుకే టాల్‌స్టాయ్ రచనలలో 'వార్ అండ్ పీస్' కంటే 'అన్నాకరెనినా' సాహిత్యపరంగా ఉన్నతమయిన రచన.

మరొక విషయం ఉంది. సామాజిక విశ్లేషణ వస్తుగతంగా సాగుతుంది. సామాజిక సంబంధాలను అది ఉన్నదున్నట్టుగా అర్థం చేసుకుంటుంది. అయితే సాహిత్యానికి సామాజిక సంబంధాల వస్తుగత స్వరూపం ప్రత్యక్ష వస్తువు కాదు. ఆ సామాజిక సంబంధాలను మనం దర్శించుకునే సిద్ధాంత ప్రత్యయాల రూపంలో అవి సాహిత్యానికి వస్తువు అవుతాయి. ఉదాహరణకు స్త్రీ పురుష సంబంధాలను చర్చించే సాహిత్యం పురుషాధిక్యత అనే సామాజిక సంబంధంలో ఉన్న సంఘర్షణను ఉన్నదున్నట్టు కాక దానిని మనం భావించుకునే కొన్ని ప్రత్యయాల రూపంలో (సంప్రదాయం, పాతివ్రత్యం, స్త్రీత్వం, స్వేచ్ఛ, సమానత్వం) వస్తువుగా స్వీకరిస్తుంది. ఇక్కడ చిక్కేమిటంటే వస్తుగత వాస్తవానికీ ఈ భావాలకూ మధ్యనున్న సంబంధం బింబం, ప్రతిబింబం లాంటిది కాదు. వాస్తవాలను ఒక రకంగా దర్శించడం వల్ల ఒక బలమయిన ప్రయోజనం నెరవేరేటట్టయితే తదనుగుణ్యమయిన భావజాల చట్రం ఏర్పడుతుంది. సామాజిక సంబంధాల వ్యవస్థిత రూపం కంటే ఈ భావజాల రూపమే సాహిత్యానికి ప్రధానం. భావజాల రూపం ద్వారానే అది వ్యవస్థిత రూపాన్ని అర్థం చేసుకుంటుంది.

నిజానికి సాహిత్య వస్తువయిన జీవితం ఒకే సమయంలో అనేక 'లెవెల్స్'లో ఉంటుంది. వస్తుగత సామాజిక సంబంధాలుంటాయి. వాటి మధ్య ఘర్షణలుంటాయి. వాటిని మనం దర్శించుకునే విభిన్న సిద్ధాంత, తాత్విక, భావజాల చట్రాలుంటాయి. వాటి మధ్య సంఘర్షణ ఉంటుంది. ఈ తాత్విక చట్రాలు తార్కికంగా ఏర్పడవు. సామాజికంగా ఏర్పడతాయి. అంటే జీవితాన్ని వస్తుగతంగా అర్థం చేసుకునే ప్రయత్నంలో ఏర్పడవు. జీవితాన్ని భిన్న ప్రయోజనాల దృష్టితో వ్యాఖ్యానించే క్రమంలో ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో ఎదిగి ఈ తాత్విక చట్రాలలో ఆలోచించడం, సంఘర్షించడం అలవర్చుకున్న వ్యక్తులుంటారు. వాళ్ళకు సామాజిక నేపథ్యమే కాక వైయక్తిక ప్రత్యేకతలుంటాయి. హేతుబద్ధంగా అనిపించే ప్రత్యేకతలేకాక మానసిక వైపరీత్యాలూ ఉంటాయి. మళ్ళీ ఈ ప్రత్యేకతలన్నీ కూడా

ఎదుగుతున్న వ్యక్తిని తన చట్రంలో ఇముడ్చుకోవడానికి సమాజం చేసే ప్రయత్నానికి అనివార్య ఫలితమయిన సంఘర్షణ నుండి పుట్టినవేనని, ఆ సంఘర్షణ రెండు వైపులా విఫలం అయినపుడు మానసిక వైపరీత్యాలకు దారి తీస్తుందని ఫ్రాయిడ్ అంటాడు. వైయక్తిక ప్రత్యేకతలు అంటున్నాం కాని వాటిని కూడా మనం వైయక్తికంగా కాక సామాజికంగానే వ్యాఖ్యానిస్తాం. వైపరీత్యాలను కూడా 'రేషనలైజ్' చేసుకుంటాం. సమాజం నుండి 'వ్యక్తి' ఏర్పడే క్రమమే అది. సామాజిక ఒత్తిడుల నుండి పుట్టే నీతులనూ, ఆదర్శాలనూ, ఆశయాలనూ వ్యక్తులు స్వంతం చేసుకునే క్రమమే అది.

జీవితం ఇన్ని 'లెవెల్స్'లోనూ ఒకే సమయంలో ఉంటుంది. ఉన్నతమయిన సాహిత్యం కూడా అన్ని 'లెవెల్స్'లోని జీవితాన్నీ వాటి అంతస్సంబంధాన్నీ విశదీకరిస్తుంది. దస్తాయవ్స్కీ 'క్రైం అండ్ పనిష్మెంట్' ఇందుకు గొప్ప ఉదాహరణ. సాహిత్య విమర్శకూడా అన్ని 'లెవెల్స్'లోనూ ఒకే సమయంలో వ్యవహరించ గలిగినపుడే పరిపూర్ణం అవుతుంది. వాస్తవికత – భావజాలం, సమాజం – వ్యక్తి అనే గతితార్కిక ద్వంద్వాలలోని అంతస్సంబంధాన్ని సమగ్రంగా విశదీకరించకుండా ఒక దాన్ని మట్టుకు ప్రతిపాదించి రెండవదాన్ని తత్ఫలితమయిన అనివార్య పర్యవసానంగా కొట్టిపారేసేది సమగ్రమయిన మార్క్సిస్టు విమర్శకాదు. అయితే దీనికి సంబంధించిన తాత్విక సిద్ధాంత సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయాయి. క్రిస్టఫర్ కాడ్వెల్ లాంటివాళ్ళు సామాజిక నేపథ్యాన్ని ప్రతిపాదించడంతో విమర్శను ముగిస్తే రేమాండ్ విలియమ్స్, అల్తూసర్ లాంటి వాళ్ళు సాహిత్యాన్ని ఉత్పత్తి సంబంధాల నేపథ్యంలో పరిశీలించకుండా దానికి సంపూర్ణమయిన స్వయం ప్రతిపత్తిని ఆపాదించడమో లేక సాహిత్య సృజన కూడా ఒక 'ఉత్పత్తి' కాబట్టి దాని అంతర్గత వైరుధ్యాల విశ్లేషణ సరిపోతుందని వాదించడమో చేసారు.

**ప్ర :** శిల్పం విషయంలో ఒక్క కవిత్వాన్ని మినహాయించి వ్యాపార రచయితలు తీసుకుంటున్న శ్రద్ధను కూడా అభ్యుదయ, విప్లవ రచయితలు తీసుకోవడం లేదని విమర్శ వస్తున్నది. తెలుగులో విశ్వజనీనమయిన రచనలు ఎందుకు రావడం లేదు?

**జ :** వ్యాపార రచయితలు ప్రజల జీవితం నుండి ఎంత దూరంగా బతుకుతున్నారో విప్లవ రచయితలు కూడా (చాలా కొద్ది మినహాయింపులతో) అంతే దూరంగా

బ్రతుకుతున్నారు. అసలు లోపం ఇక్కడే వుందనిపిస్తుంది. నిర్బంధం తీవ్రతే ప్రజా జీవితాన్ని రచయితల దగ్గరికి తెచ్చినపుడు శిల్పం రీత్యా కూడా మంచి రచనలు వస్తున్నాయి. ఉదాహరణకు, 1984-85 సంవత్సరాలలో వరంగల్‌లోని విపరీత పరిస్థితుల్లో 'సృజన'లో వచ్చిన కథలు. మంచి సాహిత్యం సృష్టించడానికి శ్రద్ధ అవసరమే కానీ శిల్పం సమస్యను 'శ్రద్ధ' పరిష్కరించదు. ప్రజల జీవితంలో చాలా సన్నిహితమయిన పరిచయం మొదట అవసరం. పరిచయం అంటే దగ్గరగా కూర్చొని చూడడం కాదు. ఏదో ఒక స్థాయిలో వాళ్ళ 'బ్రతుకుపోరు' లో పాల్గొనడం అవసరం. ఆ పైన తగు మాత్రం పరిశ్రమ కూడా చేస్తే మంచి సాహిత్యం సృష్టించడం సాధ్యమవుతుంది. మార్క్సిస్టులకు ఒక 'సిద్ధాంతభయం' ఉంటుంది. రచన చేస్తున్నంతసేపు ఫలానా విమర్శకుడు ఏమంటాడో అని భయపడుతూ రాస్తే మంచి రచన సాధ్యం కాదు. ఈ 'సిద్ధాంతభయం' ఎన్ని సిద్ధాంత గ్రంథాలు ఇంట్లో కూర్చుని చదివినా పోదు. ప్రజల జీవితంలోనూ, పోరాటాలలోనూ పాల్గొనే వాళ్ళకు దానిని పోగొట్టుకునేందుకు కావలసిన సాహసం వస్తుంది. అపుడు మనం చేసే సిద్ధాంత అధ్యయనం కూడా ఫలవంతం అవుతుంది. పాటలు రాసేవాళ్ళు ఎక్కువగా పోరాటాలతో సన్నిహితమయిన సంబంధం ఉన్న వారు కావడంతో చాలా సులభంగా వస్తు శిల్పాల ఐక్యతను తమ రచనలలో సాధించగలుగుతున్నారు. కొత్త ప్రయోగాలు సృజనాత్మకంగా చేయగలుగుతున్నారు.

తెలుగులో ఒక్క కవిత్వం మినహాయిస్తే వేరే ఏ రంగంలోనూ అంతర్జాతీయ స్థాయికి చెందిన రచయితలు ఎందుకు రావడం లేదనేది వేరే ప్రశ్న. శ్రీశ్రీ ప్రపంచంలో ఏ కవితో అయినా సరితూగుతాడు కానీ దాస్తయెవ్‌స్కీ కి పదవవంతు సరిపోయే నవలా రచయిత తెలుగులో లేడు. నవల ప్రధానంగా బూర్జువా సాహిత్య రూపం కావడం వల్ల ప్రగతిశీలం గల బలమయిన బూర్జువా వర్గం లేకపోవడాన్ని దానికి కారణంగా భావించాలేమో. జాతీయోద్యమ కాలంలో ఉన్న కొద్దిపాటి అభ్యుదయ స్వభావాన్ని కూడా కోల్పోయిన బూర్జువా వర్గం ఇవ్వాళ దుర్బలమయిన సాహిత్యాన్ని మట్టుకే సృష్టించగలుగుతోంది. ప్రజాఉద్యమం బాగా బలపడి, నవలా రూపాన్ని తాను స్వంతం చేసుకోగలిగితే మళ్ళీ మంచి నవలలు వస్తాయేమో.

**ప్ర :** ఉద్యమాలతో సంబంధం లేకపోయినా కొడవటిగంటి కుటుంబరావు మధ్యతరగతి జీవితానికి సంబంధించి మంచి నవలలు, కథలు రాశారు గదా?

**జ :** ఉద్యమం అంటే సంఘం పెట్టుకొని పోరాటం చేయడం అని అర్థం చెప్పుకుంటే కుటుంబరావుకు ఉద్యమాలతో సంబంధం లేకపోవచ్చును గానీ, ఆయన పుట్టిన అగ్రవర్ణ మధ్యతరగతి జాతీయోద్యమంలో చెప్పుకోదగ్గ పాత్ర నిర్వహించింది. దానితోబాటు జాతీయ భావాలు, సంస్కరణ భావాలతో ప్రేరణ చెందిన సాహిత్యాన్ని సృష్టించింది. పాశ్చాత్య దేశాలలోనూ 16-19 శతాబ్దాల మధ్య బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో ప్రముఖ పాత్ర వహించిన పట్టణ ప్రాంతాల మధ్యతరగతి గొప్ప సాహిత్యకారులను సృష్టించింది. వాళ్ళెవ్వరూ ఉద్యమాలతో సంబంధం ఉన్నవాళ్ళు కాకపోవచ్చును. అయితే వాళ్ళు పుట్టిన వర్గమే ఆనాడు ఒక ప్రముఖ సామాజిక పరిణామంలో పాల్గొనింది.

ఇవాళ్టి పరిస్థితి వేరు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలలోనూ జాతీయోద్యమం లోనూ మధ్యతరగతికి ఉన్న పాత్ర శ్రామిక విప్లవాలలో ఉండదు. అందుకే మధ్యతరగతిలో పుట్టిన రచయితలు ఇవ్వాళ మంచి సాహిత్యం సృజించాలంటే శ్రామిక వర్గ ఉద్యమాలతో సంకల్పపూర్వకంగా సంబంధాలు పెట్టుకోవాలి. కుటుంబరావు రాసాడు కాబట్టి నేనూ రాయగలననుకోవడం ఒక చారిత్రక దశ గడిచిపోయిందని విస్మరించడం అవుతుంది.

**ప్ర :** డాస్తయెవ్స్కీతో సరిపోల్చగల తెలుగు నవలా రచయిత లేడన్నారు. వివరణ అవసరం. 'క్రైం అండ్ పనిష్మెంట్' లాంటి నిరాశా జనకమయిన నవల ఉపయోగపడుతుందంటారా?

**జ :** క్రైస్తవ సంప్రదాయంలో నిరాశామయమయిన మానవతావాదం ఉంది. డాస్తయెవ్స్కీ ఆ సంప్రదాయానికి చెందినవాడు. ఆయన రచనలు చేసేనాటికి రష్యాలో భూస్వామ్య వ్యవస్థ కూడా పతనం అయింది. పెట్టుబడిదారీ సంబంధాలు అవతరిస్తున్నాయి. సంప్రదాయికంగా మానవ సంబంధాలలో వున్న ధర్మం, కరుణ, దయ, క్షమ మొదలయిన విలువలన్నీ పతనం అయిపోయి స్వార్థం, డబ్బు వాటి స్థానం తీసుకుంటున్నాయి. డాస్తయెవ్స్కీ వీటిని అసహ్యించుకున్నాడు. క్రైస్తవ మానవతావాద దృక్పథంతో అసహ్యించుకున్నాడు. ఆ దృక్పథం వల్ల ప్రయోజనం

తక్కువే. అయితే ఆ దృక్పథంలో సమాజాన్ని – ఆయన చూసే తప్పుడు సమాజంలోని పతనం మానవ సంబంధాలలోని అన్ని కోణాలలోనికీ, చివరికి మానసిక వైపరీత్యాలలోనికీ, తాత్విక దౌర్బల్యాలలోనికీ కూడా ఏవిధంగా ప్రవేశించిందో చూపగలిగాడు. ఆ సమగ్ర దృష్టి, ఆ సామర్థ్యం అవసరం.

**ప్ర :** సాహిత్యం అనేది ఒక వాస్తవ చిత్రణమే కాని పరిష్కారాలు, తీర్పులు చెప్పే సాధనం కాదని అంటారు. జీవితాన్ని చిత్రించడంతో రచయిత బాధ్యత పూర్తవుతుందా? అసలు రచయిత సామాజిక బాధ్యత ఏమిటి? రచయితకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందా?

**జ :** స్వేచ్ఛ అనేది ఒక భ్రమ. చైతన్యవంతంగా ప్రకటించుకునే సిద్ధాంతానికి నిబద్ధులు కానివారు అవ్యక్తంగా మనమీద పనిచేసే ప్రభావాలకు బందీలవుతారు. నిజ జీవితంలో మనం పరిష్కారాన్ని గురించి ఆలోచించకుండా సమస్యల గురించి ఆలోచించలేం. ఎవరిమీదా తీర్పుచెప్పకుండ దేనిగురించీ బాధపడలేం. ఒక్కసారి ప్రయత్నం చేసి చూస్తే అది ఎంత అసాధ్యమో తెలుస్తుంది. కాని రచనలో మట్టుకు నేను జీవితాన్ని చిత్రిస్తాను తప్ప తీర్పుచెప్పను, సమస్యల పరిష్కారాన్ని సూచించను. అంటున్నామంటే మన 'బుద్ధిజీవుల' జీవితం ఎంత పరాయికృతం అయిందో అర్థం అవుతుంది. రచన జీవితంలో నుండి పుడితే సమస్య, పరిష్కారం అనే విభజన తలెత్తదు. రచన మెదడులో నుండి, అహంలో నుండి పుడితే ఈ విభజన తలెత్తుతుంది.

అయితే ఈ చర్చ కేవలం సిద్ధాంతస్థాయిలో ఎప్పటికీ పూర్తికాదు. రచయితకు బాధ్యతలేదనే వారు ఎంత బాధ్యతారహితంగా జీవిస్తున్నారో, రచయితకు బాధ్యత వుంది అనేవారు కూడా అంతే బాధ్యతారహితంగా జీవిస్తున్నంతకాలం ఈ చర్చ పూర్తికాదు. మార్క్సిస్టు రచయితల రచన మాత్రమే కాదు, జీవితం కూడా బూర్జువా రచయితల జీవితం కంటే భిన్నంగా వుండాలి. అలా భిన్నంగా లేనందువల్లే అజంతాలాంటి వాళ్లు కూడా మార్క్సిస్టు రచయితలను వేలెత్తి చూపగలుగుతున్నారు. గద్దర్‌ను వాళ్ళు అలా విమర్శించలేరు. ఎందుకంటే బాధ్యత అన్న విషయం దగ్గరికి వచ్చేసరికి వారు గద్దర్‌తో తమను సరిపోల్చుకోలేరు. కాని మనం మాత్రం ఆచరణలో చాలావరకు మార్క్సిజం పేరిట సాంప్రదాయిక బాధ్యతలను

వదిలించుకుని వేరే ఏదో పేరుపెట్టి రాజకీయ బాధ్యతలను కూడా వదిలించుకున్నాం. సగటు మార్క్సిస్టు రచయితలకు ఏ బాధ్యతలు లేకుండా పోయాయి. ఈ పరిస్థితి మారితేగాని ఈ చర్చకు ముగింపు వుండదు. వ్యక్తిగత నిజాయితీని నేను శంకించడం లేదు. సామాజిక ఆచరణ అవసరం.

**ప్ర :** నిర్బంధ పరిస్థితుల్లో సామాజిక ఆచరణ చేపట్టే అవకాశం ఎక్కడుంది? ప్రస్తుత పరిస్థితులు రచయిత పరాయీకరణ చెందడానికి దోహదం చేయడంలేదా?
**జ :** నిర్బంధం తీవ్రంగా ఉన్నమాట వాస్తవమే గానీ కాలూ, చేయీ కదపలేని పరిస్థితి ఏమీ లేదు. ఎన్నో సమస్యలమీద ప్రజలు ఉద్యమాలూ, పోరాటాలూ ఏదో ఒకస్థాయిలో చేపడుతున్నారు. మార్క్సిస్టు రచయితలలో కొద్దిమంది మట్టుకే ఈ పోరాటాలతో సంబంధాలు పెట్టుకుంటున్నారు. అందరూ మరింత ఎక్కువగా వీటితో మమేకం కావడం అవసరం. భావాలలో కాదు, ఆచరణలో కావడం అవసరం. ఉద్యమాల నుండి రచయితలు దూరం అయ్యే పరిస్థితి కొంత కల్పిస్తే చాలులే, ఇక మిగిలింది వాళ్ళే పూర్తి చేసుకుంటారని వ్యవస్థ భావిస్తుంది. మనం ఆ ప్రయత్నాన్ని ప్రతిఘటించే బదులు లొంగిపోతున్నాం. పైగా దానిని సిద్ధాంతీకరించే స్థాయికి దిగజారుతున్నాం.

**ప్ర :** తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రంగా రాయడం సాధ్యమవుతుందా? రాజవంశాలద్వారా సాహిత్య చరిత్ర రాసి ఉత్పత్తి సంబంధాలను రాజవంశాల ద్వారానే చెప్పొచ్చు అని ఆరుద్ర అనడం ఎంతవరకు శాస్త్రీయమైనది? మనకు సాహిత్య చరిత్రకారులు లేకపోవడం లోపంకాదా?
**జ :** ఆరుద్రకు మార్క్సిజం తెలుసుననడానికి ఎటువంటి దాఖలాల్లేవు కాబట్టి ఆయన అభిప్రాయాలను చర్చించడం అనవసరం. తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రంగా రాయడం తప్పకుండా సాధ్యమవుతుంది. తెలుగు సాహిత్యంలో కొన్ని స్పష్టమయిన సంప్రదాయాలున్నాయి. వైదికబ్రాహ్మణ సంప్రదాయం, బ్రాహ్మణ వ్యతిరేక శైవ సంప్రదాయం, బ్రాహ్మణ ప్రాపంచిక దృక్పథం పరిధిలోనే ప్రజా జీవితానికి కొంచెం సన్నిహితంగా ఉన్న సంప్రదాయం, రాజాస్థానాల విలాస జీవితాలకు అనుగుణ్యమయిన సాహిత్య సంప్రదాయం, చివరికి వ్యవస్థలోని

అన్యాయంపట్ల నిరసన వ్యక్తంచేసిన విమర్శనాత్మక సంప్రదాయం – కనీసం ఈ అయిదింటిని స్పష్టంగా గుర్తించవచ్చును. ఇవి అన్నీ అన్ని దశలలోనూ లేవు. ఉన్నప్పుడు ఒకేరకంగా లేవు. మన సామాజిక చరిత్రలోని పరిణామక్రమాన్ని నేపథ్యంగా పెట్టుకుని వీటి ఆవిర్భావాన్ని ప్రభావాన్ని పతనాన్ని చర్చించడం సాధ్యమే. అయితే ముందు మన సామాజిక చరిత్ర మనకు తెలియాలి. అదే సరిగ్గా తెలీదు. దాని గురించే సరయిన పరిశోధన లేదు. ఉన్నంతలో కొంచెం సంతృప్తికరంగా అనిపించే కంభంపాటి సత్యనారాయణ గారి ప్రయత్నమే ఎంత అసంతృప్తికరంగా వుందో చూస్తే మన దుస్థితి అర్థం అవుతుంది. ఈ పరిస్థితిలో ఆరుద్ర లాంటివారు మార్క్సిస్టు మేధావులుగా చలామణి కావడంలో ఆశ్చర్యం ఏముంది?

**ప్ర :** మాండలిక భాషలో రచించడం అవసరమేనంటారా? మాండలిక భాషలో రాస్తే సార్వజనీనత వుండదుకదా?

**జ :** ప్రజాసాహిత్యం ప్రజల భాషలో వుండక తప్పదు. ప్రజల భాష ప్రాంతాలను బట్టి మారుతుంది. దానికి సార్వజనీనత లేదంటే అసలు తెలుగుభాషకే సార్వజనీనత లేదు. తెలుగులో రచనలు చేస్తే దేశంలో ఎంతమందికి అర్థం అవుతుంది? నిజానికి ఇక్కడ ప్రాంతీయ అసమానతల సమస్య వుంది. తెలుగు పత్రికలూ, సినిమాలూ ఎక్కువగా కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల భాషలో వుంటాయి. అయినా తెలంగాణ వాళ్ళుగానీ, రాయలసీమవాళ్ళు గానీ 'అవి మాండలికంలో వున్నాయి' అని చదవడం మానలేదు. నిజానికి ఆ భాషను ఎవరూ మాండలికంగానే అనుకోరు. అదే 'అసలైన' తెలుగుభాష. కరీంనగర్‌లోనో, అనంతపురంలోనో మాట్లాడేది 'మాండలికం'. కృష్ణానది విజయవాడ మీదుగా కాక అనంతపురం మీదుగా ప్రవహించి వుంటే కాటన్‌దొర దానికి ఆనకట్ట అనంతపురం దగ్గర కట్టి వుంటే అప్పుడు బెజవాడ తెలుగు ఒక మాండలికం అయివుండేది. అనంతపురం భాషే అసలు తెలుగు అయివుండేది.

మనం ఈ అసమానతల నుండి పుట్టిన న్యూనతా భావాన్ని పోగొట్టుకోవడానికి సిద్ధంగా ఉంటే 'మాండలికం' పెద్ద సమస్య అనిపించదు.

**ప్ర :** కష్టపడి మాండలిక భాషను చదివే శ్రమ కలిగించే బదులు ఒక 'లింక్‌భాష' గా మారిన భాషలో సాహిత్య సృజన చేయవచ్చు కదా?

**జ :** భాష అనేది ఒకవైపు వ్యక్తీకరణకూ, రెండవవైపు కమ్యూనికేషన్‌కూ సంబంధించిన సమస్య. తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సాధ్యమయినంత సులభంగా చెప్పడం కోసం తగిన భాషను రచయిత ఎంచుకోవాలి. కావాలని పాఠకులను కష్టపెట్టే ప్రయోగాలు చేయకూడదు గానీ కృత్రిమమయిన భాషలో రాస్తే విషయం పేలవంగా తయారవుతుంది. ఇహ అర్థం కావడం కాకపోవడం అనేది కొంతవరకు కృత్రిమమయిన సమస్య. విషయంలో ఆసక్తి వుంటే మనమే అర్థం చేసుకుంటాం. ఇంగ్లీషు ఎంతమందికి బాగా వస్తుందని దేశంలో ఇన్ని ఇంగ్లీషు నవలలు అమ్ముడుపోతున్నాయి? రావిశాస్త్రి రచనలు విశాఖపట్నం మాండలికంలో వున్నా ఆసక్తికరంగా వుంటాయి కాబట్టి అన్ని ప్రాంతాలవారూ చదివి అర్థం చేసుకోవడం లేదా?

**ప్ర :** ప్రజల జీవితంతో సంబంధం, సిద్ధాంత అధ్యయనం ఈ రెండూ అవసరం అన్నారు. కాని ప్రపంచంలోని గొప్ప రచయితల రచనలు చదివి మన శిల్పాన్ని మెరుగు పెట్టుకోవాల్సిన అవసరం లేదా? గొప్ప రచయితలందరూ సిద్ధాంత అధ్యయనం వల్లనే అద్భుతమయిన 'శిల్పాన్ని' ప్రదర్శించారంటారా?

**జ :** ఇందాక చెప్పినట్టు, గతంలో గొప్ప రచయితలు చాలావరకు తమ వర్గ ప్రయోజనాల పరిధిలో రచనలు చేశారు. దానికి పెద్దగా సిద్ధాంత అధ్యయనం అవసరం లేదు. ఇవ్వాళ కూడా గ్రామీణ ప్రాంతాలలో రైతుకూలీ యువకులు సిద్ధాంత అధ్యయనం లేకుండానే వస్తువు రీత్యానూ శిల్పంరీత్యాను ఉన్నతమయిన సాహిత్యాన్ని – పాటలను రాస్తున్నారు. మధ్యతరగతి మేధావులు శ్రామిక వర్గ సాహిత్యం సృజించాలంటే కొంత అధ్యయనం అవసరమే.

మరొక సమస్య భావజాలానికి సంబంధించినది. చరిత్రలో ఏ కొత్తవర్గం పుట్టుకొచ్చినా అది పాత పాలకవర్గాల భావజాలాన్ని ఏదో ఒక మేరకు ఎదుర్కోవాలి. అయితే శ్రామికవర్గం పాలకవర్గాల భావజాలాన్ని పూర్తిగా తలకిందులుగా చేయవలసి వుంటుంది. ఆ పని చైతన్యవంతంగా చేయకపోతే అదే ప్రభావంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే అధ్యయనం అవసరం.

### *సాహిత్య విమర్శకు సామాజిక నేపథ్య పరిశీలన సరిపోదు*

గొప్ప రచయితల రచనలు చదివితే ఉపయోగమే గానీ దానివలన గొప్ప సాహిత్యం రాయగలుగుతామనుకుంటే అది భ్రమే.

**ప్ర :** ప్రజల జీవితం, ఉద్యమాలలో భాగం పంచుకుంటే గొప్ప రచనలు వస్తాయన్నారు. చైనాలో కానీ, రష్యాలో కానీ ఉద్యమపూర్వం తప్ప, ఉద్యమంతో పాటు లేదా ఆ తర్వాత గొప్ప రచనలు ఏమి వచ్చాయి? తెలుగులో కూడా ఉద్యమాలలో ఉన్నవాళ్ళు రాసిన ఆవేశపూరితమయిన 'కొట్టు చంపు వంటి రచనలు'; ఉద్యమం లేనప్పుడు 'అమరులపై ఎలిజీలు' మాత్రమే వస్తాయి కదా? అసలు సాహిత్యం సంకుచితమయిన ఉద్యమాల చట్రంలోంచి కాక విశాల ప్రాతిపదికపై సృజించాల్సిన అవసరం లేదా? ఉద్యమ చట్రంలోకి పడినందువల్లే నేటి తెలుగు సాహిత్యానికి సార్వజనీనత లభించడం లేదనే విమర్శ మాటేమిటి?

**జ :** ప్రపంచంలోని గొప్ప సాహిత్యమంతా కూడ బలమైన సామాజిక పరిణామాలు జరుగుతున్న కాలంలో రాసినదే. ఇందాక అన్నట్టు 'ఉద్యమం' అనే మాటకు సంకుచితమైన అర్థం ఇవ్వకపోతే గొప్ప సాహిత్యమంతా ఉద్యమ సాహిత్యమే. మిల్టన్, టాల్‌స్టాయ్ లాంటి వాళ్ళు స్పష్టమయిన రాజకీయ లక్ష్యంతో రాశారు. ఇతరులు తమ చుట్టూ పరిణామం చెందుతున్న చారిత్రక వాతావరణం ప్రభావంలో రాశారు.

శ్రామికవర్గ సాహిత్యం దగ్గరికి వచ్చేసరికి కొన్ని సమస్యలు వస్తాయి. బుద్ధికీ భౌతిక శ్రమకూ మధ్యనున్న విభజన నాగరిక చరిత్ర మొదటి నుండీ వుంది. ఈ బుద్ధిజీవులకు ప్రముఖ పాత్రవున్న సామాజిక పరిణామాలు అలవోకగా గొప్ప సాహిత్యాన్నీ, కళలనూ సృష్టిస్తాయి. బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు, వలస దేశాలలో జాతీయోద్యమాలు ఈ కోవకు చెందినవి. శ్రామిక విప్లవాలు శ్రామిక వర్గ సాహిత్య కళారూపాలలో ఆ రకమయిన ఉన్నత సృష్టిని చేస్తాయి. తెలుగులో గత 20 సంవత్సరాలలో పాటలు, కొంతవరకు వచన కవిత్వం ఈ రెండు సాహిత్య రూపాలలో వస్తువు రీత్యానూ, శిల్పం రీత్యానూ మంచి కృషి జరిగింది. దానిని 'కొట్టు, చంపు' రచనలు అనడమైనా, ఎలిజీలు అనడమైనా వక్రీకరణే. ఇతర సాహిత్య రూపాలలో ఉన్నతమయిన శ్రామికవర్గ సాహిత్యం రావాలంటే ముందు బుద్ధి – భౌతిక శ్రమ అనే విభజన పోవాలేమో. కమ్యూనిస్టు సమాజం నిర్మాణ

క్రమంలో తప్పనిసరిగా జరగవలసిన ఈ పోరాటం సోవియట్ రష్యాలో ఎన్నడూ జరగలేదు. చైనాలో సాంస్కృతిక విప్లవకాలంలో కొంత ప్రయత్నం జరిగింది గానీ ఆ ప్రయత్నాన్ని నిలవనివ్వలేదు.

సార్వజనీనమయిన వస్తువు ఎట్లా వుంటుందో అర్థం కావడంలేదు. సాహిత్యంలో సార్వజనీనత అంటూ ఏదయినా ఉంటే అది సమకాలీన చారిత్రక పరిణామాలను బలంగా వ్యక్తీకరించడంలోనే ఉండగలదు. ఇప్పటి తెలుగు సాహిత్యం మాటకొస్తే ఒకవైపు మధ్యతరగతి పూర్తిగా అభ్యుదయ స్వభావాన్ని కోల్పోయి, మరొకవైపు పోరాటం చేస్తున్న జనంతో మధ్యతరగతి మేధావులు మమేకం కాలేకపోవడం దాని దౌర్భాగ్యం. దానికి పరిష్కారం సార్వజనీనత అనే ఎండమావిలో లేదు.

**ప్ర :** ఏలియనేషన్ అంటే ఏమిటి? సామాజిక వాస్తవికత గల రచనలు రచించిన వారు సైతం పరాయికరణ చెంది 'ఒంటరితనం' అనుభవించడానికి కారణ మేమిటి? మంచి కవిత్వం రాసిన రష్యన్ కవులు ఎస్సెనిన్, మయకోవస్కీ, తెలుగులో మంచి పరిశోధన చేసిన బంగోరే ఆత్మహత్య చేసుకోవడానికి కారణమేమిటి?

**జ :** ఏదయినా ఒక విషయం తన నిజస్వరూపం నుండి లేక తన మూలం నుండి లేక తన 'ఎసెన్స్' నుండి వేరు కావడాన్ని ఎలియనేషన్ అంటారు. తెలుగులో పరాయికరణ అనే మాట వాడుతున్నాము. ఒక రచయిత గురించి ఆ మాట వాడుతున్నామంటేనే రచనకు మూలం రచనలో లేదనీ, దానికి వెలుపల ఉందనీ అర్థం అవుతుంది. వెలుపల వున్న ఆ మూలం నుండి, ఆ 'ఎసెన్స్' నుండి, రచయిత పరాయికరణ చెందినప్పుడు ఒంటరితనం అనుభవించడం సహజం. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఒంటరితనం అనుభవిస్తున్న రచయిత తన రచనకు మూలం అయిన శ్రమను తిరిగి చేరుకునే ప్రయత్నం చేయాలి. వర్గ సమాజంలో ఆలోచన, రచన అనేవి వాటి సామాజిక మూలం నుండి వేరుపడ్డాయి కాబట్టి బుద్ధిజీవులకు జీవితం అర్థరహితంగా అనిపించడం, ఇన్ని కోట్ల జనం మధ్య ఒంటరితనం అనిపించడం సహజం. అయితే దీని పరిష్కారాన్ని వెతుక్కోకుండా 'నేను ఒంటరిని' అని ప్రకటించుకోవడం ఒక ఫ్యాషన్ అయిపోతే అది వేరే సంగతి.

మీరు చెప్పిన ఆ ముగ్గురు ఒకే కారణం వల్ల ఆత్మహత్య చేసుకున్నారను కోను. ఒంటరితనానికి కారణం పరాయికరణేకాక వ్యక్తిగత జీవితంలో వైఫల్యం కూడ కావచ్చు.

**ప్ర :** తెలుగులో దళిత సాహిత్యం రాకపోవడానికి కారణమేమిటి? దళితుల గురించి రాసిన సాహిత్యం కూడా అది ఎంత ప్రగతిశీలకమయినా–అగ్రవర్ణాల భావజాలంతో మాత్రమే ఎందుకు కనిపిస్తుంది?

**జ :** దళిత సాహిత్యం అంటే అంబేడ్కర్ సిద్ధాంతాల ప్రభావంలో రాసిన సాహిత్యం అయితే అది తెలుగులో ఎక్కువగా లేని మాట వాస్తవమే. రాజకీయ ఉద్యమాలలో కూడ అంబేడ్కర్ సిద్ధాంతాల ప్రభావం కొంత బలంగా ముందుకొచ్చింది గత నాలుగేళ్ళలోనే. అయితే పీడిత వర్గాల సాహిత్యం తెలుగులో చాలానే వుంది. అందులో అగ్రవర్ణ భావజాలం వుందనేది సర్వత్రా నిజం కాదు. ముఖ్యంగా 1970 తరువాత వచ్చిన పీడిత వర్గాల సాహిత్యం కులవ్యవస్థ పట్ల తీవ్రమయిన వ్యతిరేకతను ధ్వనింపజేసింది.

**ప్ర :** ఏ యుగంలోనైనా మేధావులు పాలకవర్గ భావజాలంతో ప్రభావితులయి ఉంటారు. ఇప్పుడు రచయిత ఉత్పత్తిదారు మాదిరిగా వ్యాపారమన్నా చేయాలి, లేక వ్యాపార విలువల్ని తిరస్కరించి సొంత భావనల్ని 'కళ కళ కోసం' అన్న విధంగా ప్రవేశపెట్టాలి. ఈ రెండింటి ప్రభావం నుండి వీడి ప్రజా సాహిత్యం సృజించగల పరిస్థితి ఉందా?

**జ :** ఇది బూర్జువా సాహిత్యకారులు, కళాకారులు ఎదుర్కొనే సమస్య. మొదటి మార్గాన్ని అనుసరించేవారు ఆత్మగౌరవం వదులుకొని డబ్బు సంపాదించు కుంటారు. రెండవ మార్గాన్ని అనుసరించేవారు ఆత్మగౌరవాన్ని మిగుల్చుకొని నిష్ప్రయోజనంగా బ్రతుకుతారు. అయినా ఈ మధ్యకాలంలో కళావిలువలను తానూ పోషిస్తానని ప్రభుత్వమే ముందుకు వస్తోంది కాబట్టి 'కళ కళ కోసమే' అనుకునేవాళ్ళు సహితం పేదరికంలో బ్రతకనక్కరలేదు.

శ్రామికవర్గం పక్షం వహించే రచయితలకు ఈ కృత్రిమమయిన సందిగ్ధం లేదు. ప్రజాసాహిత్యం సృజించే పరిస్థితి ఇప్పుడే కాదు, ఎప్పుడూ ఉంటుంది.

(ప్రశ్నలు, సమాధానాలు రెండూ లిఖితపూర్వకంగా ఇచ్చినవి.)